

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (ఆదివారం సాయంత్రం) సహర్ 4:58 (సోమవారం ఉదయం)

## న్యూస్ బాక్స్

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రముఖ యోగా శిక్షకుడు ఎలిగేటి కృష్ణ అన్నారు. వేములవాడ పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నీరటి తిరుపతి, ఫార్మసిస్ట్ పుష్పలత, సరోజన తదితరులు పాల్గొన్నారు.

### యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో ముందస్తుగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్‌తో కలిసి ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో పాటు సుమారు 60 మంది రక్తదానం చేశారు. అనంతరం డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, యువ ఫౌండేషన్ అధ్యక్షుడు గొడిసెల తిరుపతి గౌడ్ తదితరులు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొడిసెల రాజశేఖర్, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు బొంగాని శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ గడ్డం ప్రశాంత్, దూలం రామ్ కుమార్, రాకేష్, రాహుల్, గణేష్, హేమంత్, ప్రశాంత్, రక్తదాతలు పాల్గొన్నారు.

# గల్లీ గల్లీలో వడ్డీరాయుళ్లు



- జిల్లాలో అడ్డగోలుగా ఫైనాన్స్ దందా
- గత సంవత్సరం 54 కేసులు
- అప్పుల బాధతో నేత కార్మికుల ఆత్మహత్యలు
- నిబంధనలకు విరుద్ధంగా చిట్‌ఫండ్ వ్యాపారాలు
- జిల్లాలో ఇష్టారాజ్యంగా వడ్డీ వ్యాపారుల తీరు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్మిక, కర్షక క్షేత్రంగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల్లీ గల్లీలో వడ్డీ రాయుళ్లు పుట్టుకొస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అప్పుల బాధను తట్టుకోలేక సిరిసిల్లలో నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో ఆశించిన దిగుబడులు రాక అప్పులు తీర్చే మార్గం లేక అన్నదాతలు ప్రాణాలు వదిలిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ దందా కొనసాగుతున్న అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు ఉన్నాయి. వడ్డీరాయుళ్ల ఇష్టారాజ్యంగా మారుతున్నా పట్టించుకునే వారే లేరనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో వడ్డీ దందా అనేక కుటుంబాలను రోడ్డున పడేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడలో ఫైనాన్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. సామాన్యుల అవసరాలను అవకాశంగా తీసుకొని వీక్లీ ఫైనాన్స్, డైలీ ఫైనాన్స్, నెలవారీ ఫైనాన్స్‌లు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇండ్ల మార్ట్‌గేజ్, బంగారం తాకట్టుతో కూడా అప్పులు ఇస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కోట్ల రూపాయల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. లక్ష, రూ.2 లక్షల వరకు ఎలాంటి తనఖా లేకపోయినా చెక్కులు, ప్రామిసరీ నోట్లపై అప్పులు ఇస్తున్నారు. రూ.5 లక్షల నుంచి ఆపైనా ఏదైనా విలువైన వస్తువులు, ఇండ్లు తాకట్టు పెట్టాల్సిందే. అంతేకాకుండా గడువులోగా అప్పు చెల్లించకుంటే వేధింపులకు గురిచేయడమే కాకుండా వడ్డీపైన కూడా వడ్డీ వేస్తున్నారు.



### నామమాత్రంగా కేసులు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సామాన్యుల ఆర్థిక అవసరాలను పెట్టుబడిగా దందా చేస్తున్న వారిపై పోలీస్ యంత్రాంగం నామమాత్రంగానే నిఘా పెడుతోందనే విమర్శలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వడ్డీ వ్యాపారులపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం జిల్లాలో 54 కేసులు నమోదు చేశారు. 18 కేసుల్లో రూ.17 లక్షల 34 వేల జరిమానాలు పడ్డాయి. కొంతమంది పోలీసుల దాడులకు భయపడి నామమాత్రంగా చిట్ ఫండ్ కంపెనీల పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నా ఆ పేరుతో ఫైనాన్స్ దందాలనే నడుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని చిట్ ఫండ్ కంపెనీల బోర్డులు నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి.

### ప్రభుత్వ ఉద్యోగులు, లీడర్లు..

వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫైనాన్స్ దందాలు, వడ్డీలకు అప్పులు ఇవ్వడం కొనసాగిస్తున్నారు. వీరి బారిన పడిన వారు అధిక వడ్డీలు చెల్లించక తప్పడం లేదు. ప్రధానంగా వడ్డీలకు ఇచ్చేవారిపై కఠిన

మిగతా 8వ పేజీలో

## పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశాలలో పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్న పలు అంశాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలోని మిడ్‌మానేరు జలాశయాన్ని పూర్తిస్థాయిలో బోటింగ్, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లాలోని ప్రధాన ప్రదేశాల్లో ఒకటైన మిడ్‌మానేరు పర్యాటకులను ఆకర్షించేలా మార్పులు అవసరమన్నారు. ప్రముఖ యాత్ర స్థలమైన నాంపల్లి గుట్టపై రోప్ వే ఏర్పాటు చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. రోప్‌వే ఏర్పాటుతో భక్తులకు సులభంగా దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండటంతో పాటు, పర్యాటక అభివృద్ధికి బలమైన ప్రోత్సాహం లభించనుందన్నారు. పెండింగ్‌లో ఉన్న హరిత హోటళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని, ప్రత్యేకంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన స్థలంలో నడుస్తున్న హరిత హోటల్‌ను ఆధునికీకరించి మెరుగైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాలను మరింత అందంగా అభివృద్ధి చేయడంతో పాటు అనుబంధ దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కోరారు. మామిడిపల్లి సీతారామస్వామి దేవస్థానం, నుగుల గోవిందరాజుల స్వామి ఆలయం, రుద్రంగి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, పోతారంలోని లొంకరామేశ్వర స్వామి ఆలయం, నాగారం సీతారామ ఆలయం, మన్నెగూడెం, భీమారంతోపాటు వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఇతర గుట్టలపై ఉన్న దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతిపాదనలన్నీ త్వరలో అమలులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు

గంభీరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వెంట మండల విద్యాధికారి గంగారాం ఉన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్నే హరీశ



కర్నే హరీశకు నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్నే హరీశను నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు కర్నే హరీశ పార్టీలో చురుకుగా పనిచేస్తుండడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తుండడంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీల ఆదేశాల మేరకు కర్నే హరీశను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించామని తెలిపారు. శనివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కర్నే హరీశకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాళ్లు తాళ్లపల్లి లలిత, తీగల లక్ష్మీ, నేహూరి నవీనా, భూక్యరంజిత, బానోత్ లలిత తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామం

### పెద్దూర్‌లో తాగునీటి కటకట..

- నెల రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మోటారు
- వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు

7

### నిధులు మంజూరైనా.. ప్రారంభంకాని పనులు

- పల్లె దవాఖానాలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది..

8



ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

### జల వనరుల పరిరక్షణపై అవగాహన

వేములవాడ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు జలవనరుల పరిరక్షణపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడికరీంనగర్ నెహ్రూ యువ కేంద్ర యూత్‌ఆఫీసర్ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నీటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు శకుంతల, శారద, ప్రసాద్, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నరికి వేసిన చెట్ల పరిశీలన

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనంలో నరికివేసిన చెట్లను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పల్లెప్రకృతి వనంలో చెట్ల నరికివేయడంపై ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత' కథనానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ శనివారం స్పందించారు. నరికివేసిన చెట్లను పరిశీలించి ఆరాతీశారు. విద్యుత్తు తీగల కింద చెట్లు ఉండడంతో సెస్ సిబ్బంది చెట్లను నరికివేశారని గుర్తించారు. చెట్లను నరికి వేయకూడదని సెస్ సిబ్బందికి సూచించారు.

### తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

కోనరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేటలో వారు విలేకరులతో శనివారం మాట్లాడుతూ వేసవికాలంలో నీటి ఎద్దడి నివారించేందుకు నూతన బోరుబావుల నిర్మాణానికి, బోర్ల మరమ్మతులకు 12లక్షల 79 వేల నిధులను కోనరావుపేట మండలానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, మండలవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

సిరిసిల్ల టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పత్తిపాక వీధిలోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండి అహ్మద్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప, మసీద్ కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా రెండోరోజు పదో తరగతి పరీక్ష..

- సిరిసిల్లలో పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ - జిల్లాలో 17 మంది విద్యార్థుల గైర్హాజరు





సిరిసిల్ల పట్టణంలోని పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే

సిరిసిల్ల రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో విద్యార్థుల కోసం 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా శనివారం జరిగిన పరీక్షకు 6767మంది విద్యార్థులకు 6750మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 17మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.సిరిసిల్ల పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేలు పరిశీలించారు. పట్టణంలోని శివనగర్‌లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, సిద్ధార్థ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలల్లోని పదో తరగతి పరీక్షల కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంత మంది హాజరయ్యారనే వివరాలను విద్యశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలో పలికి అనుమతించవద్దని సూచించారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు గీతానగర్ బాలిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతుల పరీక్షలను ఎస్పీ మహేష్ బి గితే పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రావు, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు



కోనరావుపేటలో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను మండల కేంద్రంలో శనివారం శాలివాహన సంఘం అధ్యక్షుడు వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పాల్గొని పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రపంచాన్ని ఏలిన యుగపురుషుడు శాలివాహన చక్రవర్తి అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరు ముందు ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, వంగపల్లి శ్రీనివాస్, శాలివాహన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బీసీ కులగణన

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజవకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి





మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణను చేపట్టారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజవకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను శాసనసభలో ఆమోదింపజేసి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి పంపించారన్నారు. గత ప్రభుత్వం ఒక్కరోజులోనే సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టి, ఇప్పుడు బీసీ కులగణనలో తప్పులు జరగాయని సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించి చరిత్రలో నిలిచిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, వెంగళ లక్ష్మీనర్సయ్య, కత్తెర దేవదాస్, కుడికాల రవికుమార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, కమలాకర్‌రావు, దేవయ్య పాల్గొన్నారు.

### వర్గీకరణ విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు అన్నారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బాలరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాదాపు 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణపై పోరాటాలు జరగాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ఆమోదింపజేశాడన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల బిల్లును శాసన సభలో ఆమోదింప జేసిన ముఖ్యమంత్రి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌లో, జిల్లాస్థాయిలో సిరిసిల్ల పట్టణంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. త్వరలో రాష్ట్ర, జిల్లా స్థాయి విజయోత్సవ సభ నిర్వహన తేదీ, సమయం తెలియజేస్తామన్నారు. జిల్లాలోని పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గడపగడపకు విజయోత్సవ సభల సమాచారం చేరవేయాలన్నారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో విజయోత్స సభలకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపిన 41మందికి జైలు శిక్ష

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 91మంది మందుబాబులకు వేములవాడ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. గత 14రోజుల వ్యవధిలో జరిపిన వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం సేవించి పట్టుబడిన వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష, ఏడుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఐదు రోజులు జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష, మిగతా 50 మందికి జరిమానా విధించారని ఆయన వెల్లడించారు.

## గిరిజన మహిళలకు రూ.20 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించిన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ తండాకు చెందిన గిరిజన మహిళకు జ్యోతికి తహసీల్దార్ సుజాత రూ.20 వేల జరిమానా విధించారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తండాకు చెందిన గిరిజన మహిళ జ్యోతి గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో ఆమెకు రూ.20 జరిమానా విధించారని చెప్పారు. సారా తయారీ, అమ్మకాలు సాధించడంతో పాటు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

# మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు కార్మికుల వెట్టి చాకిరి

- వేతనంలో రూ.4500 కోత
- అడిగితే ఉద్యోగం నుంచి తొలగింపు.
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు



కళ్యాణ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వేతనంలో రూ.4568కోత విధిస్తున్నట్లు కార్మికులు ఆరోపించారు. మెడకల్ కళాశాలలో 75 పారిశుధ్య, సెక్యూరిటీ పోస్టులకుగాను 42మంది విధుల్లో ఉన్నారు. ఎలైన్ ఏజెన్సీ ఈ కాంట్రాక్టును దక్కించుకున్నది. ఇందులో 22మంది శానిటేషన్ విభాగంలో, సెక్యూరిటీ విభాగంలో 23మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వేతనం రూ.16500లకుగాను రూ.875 పీఎఫ్, రూ.52 ఈఎస్‌ఐకి జమ అవుతుండగా మిగితా రూ.15,573 రావాల్సి ఉండగా రూ.11005 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రూ.4568 ఎందుకు కోత విధిస్తున్నారో కాంట్రాక్టర్ చెప్పడం లేదు. అంతేకాకుండా కార్మికులపై కూడా పని భారం మోపుతున్నారు. నలుగురు పని చేసే చోట ఇద్దరితో పని చేయిస్తు న్నారు. కళాశాలలో మూడు షిఫ్టుల్లో 42మంది మాత్రమే పని చేస్తున్నారు. ముగ్గురు సూపర్‌వైజర్ విధులు నిర్వ హించాల్సి ఉండగా ఇద్దరితోనే నెట్టుకు వస్తున్నారు. 75పోస్టులకు గాను మిగతా 33పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయక పోవడంతో కార్మికులు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

**● అడ్వాన్స్‌లు, ఫ్లేడేలు లేవు...**

కాంట్రాక్టు కార్మికులకు దసరా, దీపావళి అడ్వాన్స్, బోనస్ కాంట్రాక్టర్ చెల్లించడం లేదు. ఫ్లేడేలో డ్యూటీ చేసినా కూడా రెస్ట్ ఇవ్వడం లేదు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాల్సి ఉండగా సెలవు దినాల్లో కూడా పని చేయించుకుంటున్నారు. ఆరోగ్యం బాగా లేకపోయినా విధులకు హాజరు కావాలని అంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**● అడిగితే తొలగిస్తామని బెదిరింపు**

అసలు వేతనం రూ.16500 అయితే చేతికి వచ్చేది రూ.11005 మాత్రమే ప్రతీ నెలా కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేస్తున్నాడు. ఇందులో కాంట్రాక్టర్ పీఎఫ్ రూ.875, ఈఎస్ఐ రూ.52 జమ చేస్తున్నారు. తమకు వచ్చే చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతు న్నామని, రోజు రోజుకు నిత్యా వసర ధరలు పెరిగిపోతున్నాయని, అసలు వేతనంలో కోత విధిస్తే ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పని లేదంటూ వెళ్లగొడుతున్నారని, తాము ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు.

**-వేతనాల్లో కోత విధిస్తున్నారు..**

**- శనిగరపు చంద్రశేఖర్, ఏఐటీయూసీ అధ్యక్షులు**



కార్మికుల చేత మెడికల్ కళాశాలలో పని చేయిస్తున్న కాంట్రాక్టర్ వారికి రూ.16500 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.4528 కోత విధించి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై గతంలో ప్రిన్సిపాల్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోవడం లేదు.

**పనిముట్లు కూడా ఇవ్వడం లేదు...**

**- అబ్దుల్ కరీం, కార్మిక నాయకుడు**



శానిటేషన్ విభాగంలో పని చేసే కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదు. పెనాయిల్, చీపుర్లు ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలకోసారి కూడా వాటిని ఇవ్వకుండా ఆ బిల్లును కూడా కాంట్రాక్టర్ జేబులో వేసుకుం టున్నారు. శ్రమ దోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలో ఆదర్శ నగర్‌లో శనివారం సాయంత్రం ఎస్సై కొట్టెప్రసాద్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడిచేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఆదర్శనగర్‌లోని ఇల్లుటూరి పుల్లయ్య ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో ఎస్సై దాడి చేయగా 8ఇంక్లైన్‌కాలనీకిచెందిన నలుగురు పట్టుబడగా వారివద్ద నుంచి రూ.2450 నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుబడ్డాయి. స్టేషన్‌కు తరలించారని ఎస్సై కొట్టెప్రసాద్ తెలిపారు.

## దాడికి పాల్పడిన సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య, అతడి కొడుకులు శివాజీ, విష్ణులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. గ్రామంలోని మునిగె శంకర్ ఈ నెల 21న తన ఇంటి వద్ద మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య గొడవకు దిగాడని పేర్కొన్నారు. ఇద్దరి నడుమ గొడవ చోటు చేసుకోవడంతో శంకర్ సోదరుడు దేవయ్య అక్కడకు చేరుకుని ఎందుకు తిడుతున్నావని బాలమల్లయ్యను ప్రశ్నించాడని తెలిపారు. ఆగ్రహించిన బాలమల్లయ్య, అతని కొడుకులు శివాజీ, విష్ణులు శంకర్, దేవయ్యలను దూషిస్తూ కర్రలతో దాడికి దిగారని పేర్కొన్నారు. అడ్డుగా వెళ్లిన శంకర్ భార్య భాగ్యలక్ష్మి, సోదరి మంజుల, వదిన అమృతలను చితకబాదారని చెప్పారు. బాధితుడు శంకర్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

## అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలీ మృతి



లచ్చయ్య (ఫైల్)

చందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు చేస్తున్న ఓ కూలీ అస్వస్థతకు గురై పనిచోటనే మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య(60) అనే ఉపాధి హామీ కూలీ కొంతకాలంగా గ్రామంలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నాడు. శనివారం గ్రామంలో రోడ్డుపనులకు హాజరయ్యాడు. విరామ సమయంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే తోటికూలీలు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియాఆసుపత్రి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందిస్తామని ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏపీవో రాజయ్యలు తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మామిండ్ల మహేష్ (24) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాలుగు సంవత్సరాల క్రితం మహేష్ వివాహం చేసుకోగా, ఇప్పటివరకు సంతానం కలగలేదు. దీంతో తీవ్రమనస్తాపం చెంది ఈనెల17వ తేదీన పురుగుల మందు తాగాడు. మహేష్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య కల్పన ఉంది. ఈసంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మానువాడ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య(58) తన ఇంటి ఎదురుగా మునగచెట్టు విద్యుత్ తీగల వరకు ఉన్నాయని, కొమ్మలను తొలగించేందుకు చెట్టు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు నరసయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

## ఉరివేసుకుని మహిళ బలవన్మరణం

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన మేకల పద్మ(48) జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పద్మ భర్త తిరుపతి బతుకుదెరువు కోసం 13ఏండ్ల క్రితం మలేషియా వెళ్లి 11నెలల క్రితం ఇంటికి వచ్చాడు. నెల రోజుల నుంచి తిరుపతికి జ్వరం వస్తుండగా ఆసుపత్రిలో చూపించగా టీబీ ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. తిరుపతిని మరిన్ని పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. భార్య పద్మ అతనికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆవేదనకు గురైంది. జీవితంపై విరక్తి చెందిన పద్మ ఇంట్లో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పద్మకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

## విద్యుత్ టవర్ ఎక్కిన లారీ డ్రైవర్

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ సిమెంటు కంపెనీ సమీపంలోని విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి శనివారం లారీడ్రైవర్ సార్లనరేష్ హంగామా సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆర్ స్వామి సంఘటన స్థలానికి చేరుకొని నరేష్‌ను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. నరేష్ నిత్యం సేవించి లారీ నడిపేవాడని, ఇది గమనించిన లారీ అసోసియేషన్ సభ్యులు అతడిని విదుల్లో నుంచి తొలగించారు. దీంతో ఉపాధి పోయిందనే మనస్తాపానికి గురై ఈ సంఘటనకు పాల్పడ్డాడని తెలిపారు.

## జైలులో మౌలిక వసతుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలును కరీంనగర్, పెద్దపల్లి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు కె.వెంకటేష్, కె.స్వప్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో మాట్లాడి భోజన, న్యాయసేవలు, ఆరోగ్యం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్‌గా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారికి ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ జి.విజయ్‌డేని, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, ఎల్ రమేష్, కె.శేఖర్, పెద్దపల్లి కోర్టు సూపరింటెండెంట్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్‌లు శ్రీనివాస్, కె.సంకీర్తన పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామశివారులో శనివారం ఎస్ఐ అనిల్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న పోగుల అజయ్ అనే యువకుడిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అజయ్ మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా పోలీసులను చూసి తప్పించుకొనే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతడివద్ద నుంచి 300గ్రాముల గంజాయి, ఒకఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

## ఆటో ట్రాలీ బోల్తా

● 16 మంది మహిళా కూలీలకు గాయాలు ● ముగ్గురి పరిస్థితి విషమం

మంథనిరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలను తీసుకువెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా పడిన ఘటనలో 16మందికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భట్టుపల్లి గ్రామానికి చెందిన 20 మంది మహిళ కూలీలు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తికి చెందిన టాటా ఏసీ ట్రాలీలో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారంలో మిర్చి ఏరడానికి ఉదయం 7 గంటల సమయంలో బయలుదేరి వెళ్లారు. నాగెపల్లి వద్దకు రాగానే ఆటోస్టిరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆటో అదుపు తప్పి మంథని-కాటారం ప్రధాన రహదారిపై బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడ్డ వారందరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఇందులో బందెల కిష్టమ్మ, అప్పాల శైలజ, అప్పాల వనితలకు తీవ్రగాయాలు కావడటంతో వారిని కరీంనగర్‌కు తరలించారు. వీరితోపాటు గడ్డి మల్లక్క, సత్తెమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోశక్క, పొలగాని సమ్మక్క, కొమురక్క, జంగా లక్ష్మి, స్రవంతి, కమల, బొద మల్లమ్మలకు మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి గాయపడ్డవారికి చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని, కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు ఆసుపత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. గోదావరిఖనిలో ప్రభుత్వ ఆసుపత్రి వెళ్ళిన క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందే విధంగా ఏసీపీ మడత రమేష్ ఆసుపత్రికి వచ్చి పర్యవేక్షించారు. మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు ఆసుపత్రికి వచ్చి సంఘటన వివరాలు సేకరించారు.



సంఘటన స్థలంలో బోల్తా పడిన ఆటో ట్రాలీ

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం స్కూల్‌వ్యాన్ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గౌతమ్‌హైస్కూల్ విద్యార్థులను పాఠశాలకు తరలించేందుకే వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హాజీపుర వైపువ్యాన్‌ను తీసుకుపోయే క్రమంలో వ్యాన్‌రోడ్డు ప్రక్కకు ఉన్న ట్రాన్‌ఫార్మన్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది.స్థానికులు విద్యుత్ అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ అవదూత మారుతి స్వల్పగాయలతో బయటపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐశ్రీకాంత్ తెలిపారు. అనంతరం విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.

## పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసింది. మండలంలోని కొత్తగట్టు గ్రామానికిచెందిన చీర్లంచ ప్రియాంక(34) కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చికిత్సపొందుతోంది. శనివారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ విషయాన్ని ప్రియాంక కూతురు పౌర్ణమికి తెలియకుండా పరీక్షరాసే వరకు వేచి చూశారు. పరీక్షలు రాసిన అనంతరం తల్లి మృతిచెందిన విషయాన్ని చెప్పడంతో సిరిసిల్ల జిల్లాలో పరీక్షరాసిన పౌర్ణమి హుటాహుటిన కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి గుండెలు విసేలా రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

కరీంనగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో మామిడి, వరి పంటలు దెబ్బ తిన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులను పంపించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.

**పెద్దపల్లి ట్రాలీ ఆటో ఘటనపై దిగ్భ్రాంతి**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగేపల్లి బస్‌స్టాప్ వద్ద ట్రాలీ ఆటో బోల్తా ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## అంతరిస్తున్న తాటి వనాలు

● ఉపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు



జూలపల్లి శివారులో ఎండిపోతున్న తాటిచెట్లు

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఉపాధి ఇస్తున్న తాటి చెట్లు అంతరిస్తున్నాయి. మొగిరోగం సోకి ఎండిపో తున్నాయి. కల్లు విక్రయింతో ఉపాధి పొందుతున్న కల్లుగీత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని మండల కల్లుగీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలపల్లి, కుమ్మరికుంట, కాచాపూర్, వడుకాపూర్, తెలుకుంట తదితర గ్రామా ల్లో తాటిచెట్లకు మొగిరోగంతో క్రమంగా అవి అంతరించి పోతున్నా యని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్ల సంరక్షణపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే వనాలు అంత రించిపోతున్నాయని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్లు ఎక్కడం ప్రాణాలకే ప్రమాదం అని తెలిసినా పొట్ట కూటికోసం కల్లుగీయక తప్పడం లేదంటున్నారు. తాటిచెట్లు ఎండి పోతుండడంపై కల్లుగీతకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఉపాధి మార్గాలను చూపాలని వారు కోరుతున్నారు.

**కల్లులేక రోజు కూలి గిట్టడంలేదు**

**- బొంగాని కమలాకర్‌గౌడ్, గౌడసంఘం మాజీ ఉపాధ్యక్షులు గ్రామం,మం, జూలపల్లి**



వారసత్వంగా వస్తున్న కల్లుగీత వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్న తమ కుటుంబాలకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామాల్లోని తాటిచెట్లకు రోగాలు సోకి ఎండిపోతున్నాయి. వాటిని కాపాడేప్రయత్నం ప్రభుత్వం చేపట్టాలి. రోజురోజుకు చెట్లు ఎండిపోయి కల్లులేక రోజువారి కూలి కూడా రావడం లేదు.

**ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధిచూపాలి**

**- అమరగాని మల్లేశం, కల్లుగీత కార్మికుడు గ్రామం, మం. జూలపల్లి.**



ఎన్నో ఏండ్లుగా తాటిచెట్లనే ఉపాధిగా చేసుకని తమ కుటుంబాలను వెల్లదీస్తున్నాం. తాటిచెట్లు రోగాలతో ఎండిపోతున్నాయి. ప్రస్తుతం తమకు పూటగడవడం కష్టంగా మారింది. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపి ఆదుకోవాలి.

## భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

● చిన్న హనుమాన్ జయంతి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మల్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో వచ్చేనెల11 నుంచి జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కొండగట్టులో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. కోనేరు, దీక్షవిరమణ మండపం, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. జయంతి సందర్భంగా చేపట్టే ఏర్పాట్ల గురించి సమీక్షజరిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దీక్ష విరమణ మండపం వద్ద బారికేడ్ల ఏర్పాటును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ లైట్స్, చలువ పందిళ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ పారిశుధ్యానికి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్‌కో, పంచాయితీరాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు స్వామి వారి సన్నిధిలో కలెక్టర్, ఎస్పీ పూజలు నిర్వహించగా అధికారులు సన్మానించారు. వారివెంట జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ఆలయఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘు చందర్, డీపీవో మదన్‌మోహన్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాజన్న ఆలయంలో 30 నుంచి
## శ్రీరామ నవరాత్రోత్సవాలు



వేములవాడ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో వారం రోజులపాటు ఉగాది, శ్రీరామ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి శ్రీస్వామివారలకు శ్రీసీతారామ చంద్ర స్వామివారలతో పాటుగా పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10.15 పంచాంగ పూజ సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం, రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవ ఊరేగింపును కన్నులపండుగగా చేపట్టనున్నారు. అంతేకాకుండా 4వ తేదీ శుక్రవారం నుంచి 6వ తేదీ ఆదివారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవం, హవనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సీతారామచంద్రుల దివ్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా ఏప్రిల్ 6వ ఆదివారం నిర్వహించనున్నారు. అనంతరం వైభవంగా స్వామివారి రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు.

# ఇంటర్ తర్వాత వివిధ కోర్సులు




## విద్యార్థులకు 113 కోర్సులను సూచించిన సీబీఎస్ఈ

చొప్పదండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతు న్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లోనూ కంప్యూటర్ సైన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్‌తో పాటు 113 కోర్సుల జాబితాను సీబీఎస్ఈ విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం బుక్ లెట్‌ను రూపొం దించింది. ఇంజనీరింగ్ కోర్సు ఫిషరీస్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, చార్టెడ్ అకౌంటెంట్ లాంటి అనేక రంగాలలో ఉద్యోగాలను కల్పించే కోర్సులు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న వివిద డిప్లమా, డిగ్రీ కోర్సుల వివరాలు విద్యార్థుల కోసం...

**● ఇంజనీరింగ్ కోర్సులు:**



ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ ఇంజనీరింగ్, సెరామిక్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాన్యుఫ్యాక్చ రింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజ నీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, పాలీమర్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్, మెటాలర్జీ, మెటరాలజీ, రోబోటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్

**● మేనేజ్‌మెంట్ కోర్సులు:**

బ్యాంక్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్




మేనేజ్‌మెంట్, కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంట్స్, చార్టర్డ్ అకౌంటెన్సీ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనాలిసిస్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్

**● ఇతర కోర్సులు**

ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, బయోటెక్నాలజీ, ఎర్త్‌సైన్స్ /జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిషరీస్, ఫ్లోరికల్చర్/హార్టికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, ఓషియనోగ్రఫీ, స్టాటిస్టికల్ సైన్స్, వైల్డ్ లైఫ్ బయాలజీ, జువాలజీ, ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, ఆర్ట్ రిస్టోరేషన్, క్యూరేషన్, ఎడ్యుకేషనల్/వొకేషనల్ స్కూల్ కౌన్సిలర్, మాన్యుమెంట్స్ అండ్ స్కల్ప్చర్ రిస్టోరేషన్, మ్యూసియాలజీ, సోషల్ వర్క్, స్పెషల్ ఎడ్యుకేటర్, లా, అడ్వర్టైజింగ్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్, ఆర్ట్ డైరెక్షన్, కొరియోగ్రఫీ, డైరెక్షన్, ఫిల్మ్ /డ్రామా ప్రొడక్షన్, ఫైన్ ఆర్ట్స్, పర్ఫామింగ్ ఆర్ట్స్, వోకల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, యానిమేషన్, సినిమాటోగ్రఫీ, కమ్యూనికేషన్ డిజైన్, డిజైన్, గ్రాఫిక్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ, యాక్చురియల్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, కార్పొరేట్ ఇంటెలిజెన్స్, డిటెక్టివ్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషియన్, ఫారిన్ లాంగ్వేజెస్, హోమ్ సైన్స్, ఇంటీరియర్ డిజైనింగ్, లిబరల్ స్టడీస్, లైబ్రరీ సైన్సెస్, మాంటిస్సోరీ టీచింగ్, న్యూట్రీషియన్ అండ్ డైటెటిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ ట్రావెల్.

**● వైద్య సంబంధ కోర్సులు:**



ఆయుర్వేద (బీఏఎంఎస్), డెంటల్ బీడీఎస్, హోమియోపతి, న్యాచురోపతి, ఫార్మసీ, సిద్ధ, యునానీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలి టేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలిటేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, వెటర్నరీ సైన్సెస్, స్పీచ్ లాంగ్వేజ్ అండ్ హియరింగ్

### బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఫీజుల బకాయిలు విడుదల చేయాలి
### - బీఏఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సంబంధించిన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో స్కూళ్లను ప్రభుత్వమే నడిపించాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రాష్ట్ర కార్యదర్శి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 180 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ విద్యార్థులు 18వేలు, ఎస్టీ విద్యార్థులు 7వేల మంది మొత్తం 25వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారం భించారని తెలిపారు. 17వేల మంది అణచి వేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, వ్యవసాయ కూలీల పిల్లలు లబ్ధిపొందారని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి 20వేల రూపాయలు చెల్లించే వారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఈ సీట్ల సంఖ్యను 25 వేలకు పెంచడమే కాకుండా రూ.20 వేల మొత్తాన్ని రూ.42 వేలకు పెంచారని పేర్కొన్నారు. ఏటా రూ.100 కోట్ల బడ్జెట్ రిలీజ్ చేశారని, ఇందులో రూ.80 కోట్లు హాస్టళ్లకు రూ.20 కోట్లు డేస్కాలర్ విద్యార్థులకు నిధులు విడుదలయ్యేవని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లకు 200 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉన్న స్కూళ్లకు రూ.50 కోట్లు మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. మిగతా 150 కోట్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే 150కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు.

# కొండగట్టులో చలువ పందిళ్ల జాడేదీ?

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి వేసవిలో భక్తుల సౌకర్యార్థం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిధిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండగా ఈ సారి ఇంకా వాటి జాడ కనిపించడం లేదు. ఇటీవల భానుడి ప్రతాపంతో ఎండలు మండుతుండగా భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఆలయ ఆవరణంలో నడవడానికి కొంత మేర మ్యాట్ వేయగా చలువ పందిళ్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రతి ఏటా టెండర్ ద్వారా సుమారు రూ.10లక్షల పైచిలుకుతో చలువ పందిళ్లు వేస్తుండగా ఇప్పటి వరకు ఏర్పాటు కాకపోవడంతో మధ్యాహ్న సమయంలో ఆలయ ఆవరణలో భక్తులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విద్యా సంస్థలకు త్వరలోనే వేసవి సెలవులు రానుండడం, హనుమాన్ జయంతి ఉత్సవాలు సమీపిస్తుండడంతో భక్తుల రాక పెరుగుతుంది. టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు అంటున్నారు. త్వరలో చలువ పందిళ్ల పనులు ప్రారంభం అవుతాయని దేవస్థానం పర్యవేక్షకులు సునీల్ తెలిపారు.

### ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వందలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం

# కనుమరుగవుతున్న గొంగళ్లు

**● ఆదరణ కోల్పోవడంతో నేసే వారు కరువు**

కొడిమ్యాల, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాలు 20 సంవత్సరాల క్రితం గొంగళ్ల నేతకు ప్రసిద్ధి చెందాయి. కానీ ప్రస్తుతం గొంగళ్లకు ఆదరణ తగ్గింది. గొంగళ్లకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి పలు రకాల బ్లాంకెట్లు రంగ ప్రవేశం చేయడంతో గొంగళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాల్లో గతంలో సుమారు 50 మంది గొంగళ్లను నేస్తూ జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో గొంగళ్లు నేసే వారు కూడా కరువయ్యారు. ప్రస్తుతం పూడూర్ గ్రామానికి చెందిన రొడ్డ అంజయ్య అనే వ్యక్తి కర్నాటక రాష్ట్రం నుంచి గొర్రె ఉన్నితో తయారు చేసిన గొంగళ్లను తీసుకువచ్చి పసుపు, ఎరుపు రంగులలో కడ అంచు కట్టి విక్రయిస్తున్నాడు. డిజైన్‌ను బట్టి 300 రూపాయల నుంచి 3వేల రూపాయల వరకు ఒక్కో గొంగళి ధర పలుకుతోంది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మల్లన్న పట్నాల సమయంలో సుమారు లక్ష రూపాయల విలువైన గొంగళ్లు అమ్ముడు పోతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు వెళ్లి అక్కడ గొంగళ్లను అమ్ముకునే వారికి హోల్‌సేల్‌గా ఇచ్చివస్తాన్నారు.



### సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి
### -రొడ్డ అంజయ్య, పూడూర్ గ్రామం



గొంగళ్ల తయారీకి కుర్మలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన కుర్మలకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.



అంచు కట్టుతున్న మహిళలు

# ధర్మపురిలో ఘనంగా ఉగ్ర నారసింహుడి ఏకాంతోత్సవం



ధర్మపురిలో ఉగ్ర నారసింహస్వామి ఏకాంతోత్సవం



శేషప్ప కళావేదికపై చిన్నారుల ప్రదర్శన

**● ముగిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు**

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (ఉగ్ర) వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టు ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అంతకు ముందు శేషప్ప కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

### 26,27 తేదీల్లో వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో బీసీ కమిషన్ అధ్యయనం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమ కులాల పేర్లను మార్చాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను స్వీకరించిన బీసీ కమిషన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నది. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలతో కూడిన అధికారుల బృందం ఈనెల 26న వేములవాడ, 27న సిరిసిల్లలో వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను సందర్శించనున్నారు. అదే రోజున జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

### అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు
## ఉమ్మడి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు



ఖో-ఖో పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్ (చామనపల్లి జడ్పీహెచ్‌ఎస్), పీచు జ్యోతి(బొమ్మనపల్లి జడ్పీహెచ్‌ఎస్), జి రేణుక(కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్), మార్గం నవీన్(నంచర్ల జడ్పీహెచ్ఎస్), వాసం నవీన్‌కుమార్(భూషణ్‌రావుపేట జడ్పీహెచ్‌ఎస్)లు పాల్గొంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభచాటిన వీరు అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వి సూర్యప్రకాశ్, ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సభ్యులు సీఐ కుమారస్వామి, ఎస్ఐ రమేష్, సీహెచ్ తిరుపతిరెడ్డి, ఏ రవీందర్, ఎస్కే మోయినుద్దీన్, ఆర్ తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ కుమార్, డాక్టర్ వి కుమారస్వామి, రైల్వే ఖో-ఖో కోచ్ ఇ నరేష్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

### రసాయన శాస్త్రంతో ఉపాధి అవకాశాలు

గణేశ్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్ర అధ్యయనంతో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ కే కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా లిమిటెడ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కే కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ లక్ష్య సాధన దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్. రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేళ్ల సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పెద్దూర్‌లో తాగునీటి కటకట..

- నెల రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మోటారు
- వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



సిరిసిల్ల పెద్దూర్‌లో దుప్యానాయక్ తండాలో వ్యవసాయ బోరునుంచి వేసుకున్న పైప్‌లు ↑ తండాలో కాలిపోయిన బోర్‌మోటర్ →

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోర్లు చెడిపోవడంతో నెల రోజులు నుంచి పెద్దూర్ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేసిన సమయంలో 8వ వార్డు, 9వ వార్డులుగా విభజించారు. అయితే పెద్దూర్ గ్రామంతోపాటు 9వ వార్డులోని దూప్యానాయక్ తండా, మాలపల్లె, తుర్కకాశీకాలనీ, బాబాజీ కాలనీలలో ఉన్న బోర్‌మోటార్లు నెలరోజుల క్రితం కాలి పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బోర్‌మోటార్‌కు మరమ్మతులు చేయించాలని ఇద్దరు మాజీ కౌన్సిలర్‌లతోపాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌మోటార్‌ను బాగుచేయించి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● తాగునీటి బావుల పైప్‌లైన్‌లను బాగు చేయాలి పెద్దూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటిని అందించేందుకు పక్కనున్న మానేరు వాగులో జీపీ నిధులతో రెండు బావులతో పాటు బోర్లను వేశారు. మంచినీటి ట్యాంక్‌లకు పైప్‌లైన్‌లను వేసి నీటిని అందించారు. మిషన్ భగీరథ రావడంతో ఆ బావులు, బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ పైప్‌లైన్‌లను దొంగిలించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మానేరు వాగులోని బావులు, బోర్లకు కొత్తగా పైప్‌లైన్‌లను వేసి నీళ్ల అందించాలని ప్రజలు కోరుతున్నారు.

### బోరు కాలిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు..
### - భూక్య విజయ, దూప్యానాయక్ తండా



పెద్దూర్ శివారులోని దూప్యానాయక్ తండాలో తాగునీరు అందించే బోరు నెలరోజుల క్రితం కాలిపోయింది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. రోజు ఉదయం, సాయంత్రం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చుకుంటున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌లను మరమ్మతులు చేయించాలి.

### మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు..
### - షేక్ అలీబీ, తుర్కకాశీ కాలనీ, పెద్దూర్



పెద్దూర్ శివారులోని తుర్కకాశీ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ట్యాంక్‌ను నిర్మించి ఇంటింటికి నల్లాలను ఏర్పాటు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చాలి.

## అంకాపూర్‌కు తరలిన రైతులు

చందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నూతన విధానం అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతుల అధ్యయనానికి మండల రైతు సంక్షేమ సంఘం సభ్యులు అంకాపూర్‌కు తరలివెళ్లారు. వ్యవసాయం పంట మార్పిడి, సేంద్రియ ఎరువులు వాడకం విధానం, నూతన వ్యవసాయ పద్ధతులు, వాణిజ్య పంటలతో తక్కువ ఖర్చుతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించడంపై అధ్యయనం చేయడానికి తరలివెళ్ళినట్లు సంఘం అధ్యక్షులు చిలక పెంటయ్య తెలిపారు. చంటి బాబురావు, దుమ్ము అంజయ్య, రమేష్ రావు, పోతరాజు తిరుపతి, రవీందర్‌రెడ్డి దుద్దిళ్ల లచ్చిరెడ్డి, లక్కర్సు మహేష్, రేషం రామస్వామి, పోతరాజు మోహినిలు ఉన్నారు.

## సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగే సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని. రేణికుంట టోల్‌ప్లాజా వద్ద నుంచి ర్యాలీ ఉంటున్నందున మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఇల్లంతకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన క్రావుల ఎల్లయ్య ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ శనివారం పరామర్శించి వంట సామగ్రి అందించారు. కార్యక్రమంలో అనీల్ కుమార్, లచ్చయ్య, సంజీత్, అనీల్, వేణు, రాజు, బాబు అరవింద్ తదితరులు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంకింద అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. రూ.లక్ష లోపు, ఆపై పనిముట్ల కోసం ఎకరంలోపు, పైబడి వ్యవసాయభూమి కలిగిఉండాలన్నారు. దరఖాస్తుదారులు పత్రంతోపాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్‌లను ఈనెల 25లోగా సమర్పించాలని కోరారు.

# నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని పనులు

**- పల్లె దవాఖానాలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది..**



పల్లె దవాఖానాలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇల్లంతకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెరిగితే మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రజలు భావించారు. పల్లె దవాఖానాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగించడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరైనా ఆసుపత్రి భవన నిర్మాణం పనులు ప్రారంభం కావడం లేదు. ఉమ్మడి జిల్లాలోనే పురాతన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒక్కటి. దాతలు విరాళంగా ఇచ్చిన స్థలంలో 1972లో ఆసుపత్రి భవనాన్ని నిర్మించారు. మండలంలోని 33 గ్రామపంచాయతీలకు ఉన్న ఏకైక ఆసుపత్రి కావడంతో నిత్యం పెద్దసంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని పెంచుతానని అప్పటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. చాలా రోజులు గడిచినా ఆసుపత్రి స్థాయి పెంచకపోవడంతో యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టారు. దీనితో ప్రభుత్వం ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనం కోసం 2023లో ప్రభుత్వం రూ.కోటి 53లక్షలు కేటాయించింది. అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భూమిపూజ చేశారు. ఆసుపత్రి పక్కనే 133 విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నందు వల్ల రేడియేషన్ సమస్య ఏర్పడుతుందని కొంత మంది ప్రజాప్రతినిధులు, ఎలాంటి సమస్య ఉండదని మరికొంత మంది ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇరువర్గాల మధ్య వచ్చిన విభేదాలతో ప్రారంభమైన పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించి అందులో భాగంగా ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని 30పడకల ఆసుపత్రిగా మార్చుతున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. కొద్ది రోజుల్లోనే దీనిని 50పడకల ఆసుపత్రిగా మార్చుతూ రూ.17.50కోట్లు మంజూరు చేశారు. 2023లో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పనులు ప్రారంభించి, శిలాఫలకం వేశారు. ఇల్లంతకుంటకు 50పడకల ఆసుపత్రి రావడంతో ఇక్కడ ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పెద్దలింగాపూర్ గ్రామానికి మార్చారు. నూతన భవనం కోసం వచ్చిన నిధులతో అక్కడ ఆసుపత్రి భవనం నిర్మించారు. అనేక అవాంతరాల మధ్య పెద్దలింగాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం అయ్యింది. ఇల్లంతకుంటలో ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది వారం రోజుల క్రితం ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని సామగ్రి, సిబ్బంది పెద్దలింగాపూర్ ఆసుపత్రికి వెళ్లారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తరలిపోవడంతో ఇల్లంతకుంటలోని పల్లె దవాఖానాలో వైద్యసేవలు అందిస్తున్నారు. పల్లె దవాఖానాలో తాత్కాలిక డాక్టర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు మాత్రమే పనిచేస్తున్నారు. పల్లె దవాఖానాలో కనీస వసతులు లేవు. ఆయూష్ సేవలందించడానికి గది కూడా లేదు. 50 పడకల ఆసుపత్రి భవనం ఎప్పటికి పూర్తి అవుతుందో వైద్యసేవలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం ఇరుకైన గదిలో నామమాత్రం సేవలు అందించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అనేక ఉద్యమాలు చేశాం..

**- బెంద్రం తిరుపతిరెడ్డి, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచాలని ఉద్యమాలు చేశాం. అప్పటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతో ప్రతినెల ఉద్యమాలు చేస్తే కేసులు పెట్టారు. ఇప్పటికి కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. ఆసుపత్రి స్థాయి పెంచారని సంతోషపడాలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పల్లె దవాఖానాలో కొనసాగుతోందని బాధపడాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి మెరుగైన వైద్యసేవలు అందించాలి. రోగులు ప్రతిరోజు ఇబ్బంది పడుతున్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే..

**- పల్లె నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు**



ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పనులు ప్రారంభం కాలేదు. తాత్కాలికంగా అద్దెకు తీసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగించకుండా ఇరుకైన పల్లె దవాఖానాలో కొనసాగించడం సరికాదు. కనీసం సిబ్బంది కూర్చోవడానికి కూడా పల్లె దవాఖానాలో స్థలం లేదు. ప్రభుత్వం పునరాలోచించి పెద్దలింగాపూర్ ఆసుపత్రిని కొనసాగిస్తునే ఇల్లంతకుంటలో మెరుగైన వైద్య సేవలందించాలి.

### మెరుగైన వైద్యసేవలే లక్ష్యం..

**- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే**



ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం ఆసుపత్రి స్థాయిని పెంచి నిధులు మంజూరు చేశామని ప్రకటించినదే తప్ప పనులు ఎందుకు ప్రారంభించలేదు. అనేక పనులకు కేవలం శిలాఫలకాలు వేస్తూపోయారు. ఇల్లంతకుంటలో నూతన భవనానికి నిధులు మంజూరు చేయించి, పనులు సత్వరమే ప్రారంభం అయ్యేలా చూస్తాం. పల్లె దవాఖానలో వసతుల కల్పనకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

## గల్లీ గల్లీలో వడ్డీరాయుళ్లు..

(5వ పేజీ తరువాయి)

చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిమాండ్ ఉన్నా రాజకీయ ఒత్తిళ్లతో వెనకడుగు వేస్తున్నారని భావిస్తున్నారు.

### రియల్ దందా తగ్గడమే..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్ధత నెలకొంది. దీంతో రియల్ వ్యాపారులు వడ్డీ వ్యాపారులుగా, ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులుగా మారుతున్నారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ దందాలో అవసరాన్ని బట్టి ఆదాయాన్ని సర్దుబాటు చేసే వీలు ఉండడంతో వడ్డీ వ్యాపారాల వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. వడ్డీ వ్యాపారులు సాధారణంగా కొందరు రూ.2 నుంచి రూ.3 వరకు వసూలు చేస్తుండగా, కొంతమంది 5 శాతం వసూలు చేస్తున్నారు.

### చితికిపోతున్న సామాన్యులు..

మధ్య తరగతి కుటుంబాలకు బ్యాంక్‌ల్లో రుణాలు దొరికే పరిస్థితి ఉండదు. అత్యవసర పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రైవేటు ఫైనాన్స్‌లతో పాటు యువకులు లోన్ యాప్స్ ద్వారా రుణాలు పొందుతున్నారు. అవసరానికి డబ్బులు వస్తుండడంతో అప్పులు చేస్తూ వాటిని చెల్లించలేక సామాన్యుల బతుకులు చితికిపోతున్నాయి. వడ్డీ వ్యాపారులు ఒత్తిళ్లు చేయడంతో చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

## మహనీయుల జయంతి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు..

**- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహనీయుల జయంతి వేడుకల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం మహనీయుల జయంతి వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి తోపాటు 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి వేడుకలకు సంపూర్ణ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గ్రామ పంచాయితీ నిధుల నుంచి గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాల వద్ద అలంకరణలు, పూలమాలలు వేయడం వంటి పనులు చేయాలని సూచించారు. వేములవాడలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం రూ.16లక్షల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచామని కలెక్టర్ ప్రకటించారు. అంబేద్కర్ జయంతి, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల సందర్భంగా సాధారణ ప్రజల రవాణాకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా రోడ్‌ల బ్లాక్‌లు చేయాలని ప్రజలకు వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి వేల్ఫేర్ అధికారి రాజామనోహర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మీ, నాయకులు రాగుల రాములు, బోలుమాల శంకర్, జక్కుల యాదగిరి, గుంటి వేణు, ఎరవెల్లి నాగరాజు, అంకని భాను, ఖానాపురం లక్ష్మణ్, బడె స్వామిదాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### రహదారుల నిర్మాణాలకు అధిక నిధులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణాలకు అధిక నిధులు కేటాయిస్తోందని ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. బండలింగంపల్లి గ్రామాల్లో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన సీసీ రహదారి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆమె భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ పల్లెల్లో రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల నిర్మాణాలను చేపడుతోందన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చాగౌడ్, అంజిరెడ్డి, బాలుయాదవ్, రమేశ్, ఎల్లాగౌడ్, హైమద్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

## యారన్ సబ్సిడీని కార్మికులకు అందించాలి

**- సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమణ**

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి కార్మికులకు అందజేయాలని సీఐటీయూ పవర్‌లూంవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తయారుచేయించిన బతుకమ్మ చీరలను 2023 సంవత్సరంలో తయారు చేసిన వాటికి రావాల్సిన బతుకమ్మ చీరలను పదిశాతం యారన్ సబ్సీడీ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి కార్మికుల ఖాతాల్లో జమచేయాలంటూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట కార్మికులతో ధర్నా చేస్తామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి మరమగ్గాల కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని రమణ కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, సిరిమల్లె సత్యం, ఒగ్గు గణేష్, బింగి సంపత్, నందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం స్థల పరిశీలన

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్న బోనాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలాన్ని శనివారం సిరిసిల్ల తహసీల్దార్ మహేష్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం లేకపోవడంతో రెండో బైపాస్ రోడ్డులోనే ధాన్యాన్ని ఆరబెట్టడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ధాన్యం కొనుగోలు కోసం స్థలాన్ని ఏర్పాటు చేయాలని రైతులు, గ్రామస్థులు సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి విన్నవించగా ఆయన సూచనల మేరకు శనివారం తహసీల్దార్ మహేష్ గ్రామానికి వెళ్లి కొనుగోలు కేంద్రానికి అవసరమైన స్థలాలను పరిశీలించారు. గ్రామంలో ప్రభుత్వ భూమిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసుకోవాలని తహసీల్దార్ మహిళాసంఘాల సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు బస్సుల కొరత


ఆటోలో ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణిస్తున్న విద్యార్థి

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఆందోళన చెందుతున్నారు. పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. మండలంలోని దుమాల, తిమ్మాపూర్, బండలింగంపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు రాసేందుకు విద్యా శాఖ అధికారులు మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. సుమారు 10 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఆటోలో 12నుంచి 15 మంది విద్యార్థులు కిక్కిరిసి కూర్చుంటున్నారు. ఆటోలు అందుబాటులో లేని గ్రామాల విద్యార్థులను తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై పరీక్ష కేంద్రాలకు తీసుకెళుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాలనుంచి పరీక్ష కేంద్రానికి ఆర్టీసీ బస్సులను కేటాయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేటలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రూ 5 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని నారాయణ, నాయకులు కూస రవి, గడ్డమీది నారాయణ, బత్తిని మల్లయ్య, పర్శరాం, లస్మయ్య, మల్లయ్య, అంజయ్య, భూమయ్య, వీరేశం, స్వామి, మీస్‌రెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

### ఏఐఎస్ఎఫ్ నాయకుడి ముందస్తు అరెస్టు

కోనరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంగూరి రంజిత్‌ను కోనరావుపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. విద్యారంగానికి ప్రభుత్వం ఎక్కువ శాతం నిధులు కేటాయించలేదని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపేందుకు చలో హైదరాబాద్‌కు తరలివెళ్తారని ముందస్తుగా అంగూరి రంజిత్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

### నియామకం

గంభీరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామానికి చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కుడెల్లి ప్రవీణ్ కుమార్ మాదిగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ బాధ్యతలో నియమించారు. శుక్రవారం కరీంనగర్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం ఉద్యమ కార్యాచరణ అమలుకు కృషి చేయాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లిలో ఎంపీ బండి సంజయ్ కుమార్ నిధులతో జరిగే సీసీ రోడ్డు నిర్మాణానికి బీజేపీ నాయకులు శనివారం భూమి పూజ నిర్వహించారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, అధ్యక్షుడు వంగ పరశురాములు నాయకులు వంగ సత్తయ్య, మల్యాల రాజు, రంగరాజు, ఎల్లయ్యదేవయ్య, సత్తయ్య, నారాయణ, పొన్నం శ్రీనివాస్, కట్ట శ్రీధర్ బాబు, అడ్డిక సంతోష్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేంద్రం అధికంగా నిధులు కేటాయిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. శనివారం తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద తంగళ్ళపల్లి మండలానికి రూ. కోటి 75 లక్షల నిధులను కేటాయించారు. దీంట్లో భాగంగా సారంపల్లి గ్రామంలో 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి నిధులు మంజూరు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, బూత్ అధ్యక్షుడు రాధా వినయ్, బీజేపీ నాయకులు దుమాల శ్రీకాంత్, వంతడుపుల సుధాకర్, సందేవేని రాజు, సిరిసిల్ల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

### ఒకే దేశం - ఒకే ఎన్నికపై అవగాహన సదస్సు

రుద్రంగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నికపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లపు అన్నపూర్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్ హాజరై మాట్లాడారు. అనంతరం పార్టీలో పలువురు మహిళలు చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అల్లూరి అశోక్‌రెడ్డి, నాయకులు బోయినీ రాజు, తాళ్లపల్లి బాలకిషన్‌రావు, కర్నవత్తుల వేణు, నెవూరి కిషన్, పెద్ది శ్రావణ్, అల్లూరి రవీందర్‌రెడ్డి, పండుగు గంగాధర్, మంచే వసంత్, గనికంటి వెంకటి, అక్కెనపల్లి నర్సింగరావు, పడాల గజనంద్, భూక్యానరేష్, భూక్యా ప్రశాంత్, నేవురి శేఖర్, నేవూరి శ్రీను పాల్గొన్నారు.

● గంభీరావుపేట : ఒకే దేశం ఒకే ఎన్నికపై బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కన్వీనర్ మల్లారం సంతోష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్ యాదవ్, మండల కన్వీనర్ గడ్డమీద ప్రసాద్ రెడ్డి, కోకన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, కోడె రమేష్, పత్తి స్వామి, కృష్ణ కాంత్ యాదవ్, మద్దుల రాజిరెడ్డి, శ్రావణ్‌యాదవ్, పెద్దూరి పరుషగౌడ్, విగ్నేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్,ఆంజనేయులు మల్లేష్ యాదవ్ గుర్రపు నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నీటి సంరక్షణపై అవగాహన

చందుర్తి,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం, నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహిచారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో నీటి సంరక్షణపై చిత్రలేఖనం గీయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్. జలందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, సంపతి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర పోరాట అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ బలిదానాన్ని గుర్తు చేసుకుంటూ శనివారం వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మంజుల, లక్ష్మీ, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు..

సిరిసిల్ల టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్వీ నాయకులను శనివారం తెల్లవారు జామున పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్వీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు సిరిసిల్లలో ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్, కంచర్ల రవిగౌడ్, షేక్ సికింధర్, ఎస్‌కే బాబా, కనుకుంట్ల వెంకరమణ ఉన్నారు.

●వేములవాడ : వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పోతు అనిల్ కుమార్, దిలీప్‌ను వేములవాడ పోలీసులు శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు.

● ఇల్లంతకుంట : శాసనసభ ముట్టడికి వెళుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు పలు సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ యువజన విభాగ అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు ఎంగ్ర చందన్, పెండల ఆదిత్య, బండారి చందు, గుంటి మధు తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలో బీఆర్ఎస్వీ నాయకులు చీమల ప్రశాంత్, బొల్లవేణి ఎల్లం యాదవ్, పొన్నాల చక్రపాణి, నందగిరి భాస్కర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిని మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, జిల్లా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు.

# వడగండ్ల వర్షం.. పంట నష్టం..


సిరిసిల్లలో రోడ్లపై వరదనీరు


సనుగులలో వడగండ్లకు రాలిన వడ్లు

సిరిసిల్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల గాలులతో కూడిన వడగండ్ల వర్షం పడింది. శనివారం సిరిసిల్లలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని వర్షం కురిసింది. సిరిసిల్లలో పలు చోట్ల రోడ్లు జలమయంగా మారాయి. సిరిసిల్ల శివారు విలీన గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. చందుర్తి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ ప్రాంతాల్లో వర్షం కురిసింది. వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం బాలమల్లుపల్లె, నర్సింహులపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు వరి పంట దెబ్బతింది. రెండు గ్రామాల్లో సుమారు 600 ఎకరాల వరకు వరి పంట సాగు చేయగా 50ఎకరాల వరకు పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు.

● చందుర్తి : చందుర్తి మండలం కేంద్రంతో పాటు సనుగుల, కిష్టంపేట, మర్రిగడ్డ తదితర గ్రామాలలో శనివారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. చందుర్తి, సనుగుల, కిష్టంపేట గ్రామాల్లో కురిసిన వడగడ్ల వర్షనికి పొట్ట దశకు వచ్చిన వరి పంటతో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వని కోరారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో శనివారం స్వల్పంగా వడగళ్ళ వాన కురిసింది. రామోజిపేట, ఒగులాపూర్, సోమారంపేట, ఇల్లంతకుంట తదితర గ్రామాలలో వడగళ్ళ వాన వల్ల కోయడానికి సిద్దంగా ఉన్న వరిపంటకు నష్టం వాటిల్లింది. వడగళ్ళవానతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురువడంతో రైతులు ఆందోళనకు గురైయ్యారు. విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి చేతి కోచ్చిన పంటలుదెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురైతున్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో వడగళ్ల వర్షం శనివారం మధ్యాహ్నం కురిసింది. సుమారు అరగంటసేపు వర్షం పడింది. నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితిలో వర్షాలు పడడం సంతోషంగా ఉందని, వడగండ్లు పడడంతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంద ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తంగళ్లపల్లి మండలంలో దెబ్బతిన్న వరి పంట

# పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు


శాంతినగర్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి జయ


సనుగులలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వీర్నపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం శాంతి నగర్‌లో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి వరిపంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. శాంతినగర్ లో35 ఎకరాల వరి పంట అకాల వర్షానికి వడ్లు నేల రాలినట్లు మండల వ్యవసాయ అధికారి కుమారి జయ తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకో వాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్పతి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ భరోసా ఇచ్చారు.

● చందుర్తి : చందుర్తి మండలంలో ఈనెల 21న కురిసిన వడగండ్ల వర్షానికి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ కలిసి పంట నష్టం సర్వే చేశారు. మండలంలోని సనుగుల, దేవుని తండా, జలపతి తండా గ్రామాల్లో వడగళ్ల వర్షంతో నష్టపోయిన పంట పొలాలను మండల అధికారులు, నాయకులు కలిసి శనివారం పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం సనుగుల 35, జోగాపూర్ 25, మల్యాల 20, చందుర్తిలో 10 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు